క్లుప్తంగా

ఆధార్ శిబిరానికి విశేష స్పందన



సుగాలిమెట్టలో పిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామ సచివాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేర కు ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి నాగేంద్రనాయక్ మాట్లాడుతూ.. శిబిరంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, 5–15 సంవత్సరాల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్ డౌన్‌లోడ్, అలాగే ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం, మార్పులు, చేర్పులు చేయడం జరిగిందన్నారు. వీటితో పాటు కొత్తవారికి ఆధార్‌ను నమోదు చేసినట్లు చెప్పారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ అధికారి సుకన్య, సంతోష్‌కుమార్, అనిల్, అంజలిబాయ్, ఫరీదా, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గూడూరు రూరల్: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలకు పరిష్కారం చూపాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు.పెంచికలపాడులోని సచివాల యాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని,విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకునివెళతామన్నారు. ప్రతిరోజు సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చేవినతులు, ఫిర్యాదులకు స్పందించి పరిష్కారం చూపాలన్నారు.సమస్య తీవ్రత ఎక్కు వగా ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. సచివాలయాల్లో అందించే సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.

విజేత కర్ణాటక వృషభాలు

గూడూరు: పట్టణంలో తిమ్మగురుడు స్వామి జాతరను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలలో కర్ణాటక రాష్ట్రంలోని పాల్కందొడ్డి గ్రామం ఖాజాహుసేన్‌కు చెందిన ఎద్దులు విజేతగా నిలిచాయి. గురువారం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు అతిథులుగా పాల్గొన్నారు. మొదటి బహుమతిగా రూ.50 వేలు, 2వ బహుమతి అనంతపురం జిల్లా పులం గోవిందు ఎద్దులు నిలవగా రూ.40 వేలు, 3వ స్థానంలో నంద్యాల జిల్లా టి.హుసేనాపురం రామసుబ్బారెడ్డి ఎద్దులు నిలవగా రూ.30 వేలు, 4 వ స్థానంలో అనంతపురం జిల్లా పుచ్చులపాడు గ్రామానికి చెందిన భీమలింగప్ప ఎద్దులు నిలవగా 20 వేలు, 5వ స్థానంలో నంద్యాల జిల్లా చిన్న కానాల గ్రామానికి చెందిన ఎద్దులు నిలవగా ఆయనకు రూ.10 వేలు, 6వ స్థానంలో నంద్యాల జిల్లా సీసంగుంతల గ్రామానికి చెందిన మదన్‌మోహన్ రెడ్డి ఎద్దులు నిలవగా ఆయనకు రూ.5 వేలు చొప్పుల నిర్వాహకులు అందించారు. నాయకులు పత్తి రంగడు, చనుగొండ్ల దౌల తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



ఖాజన్న (ఫైల్)

సి.బెళగల్: మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన పింజరి ఖాజన్న(32) కోలుకోలేక గురువారం మృతి చెందారు. వివరాలు.. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముండే పింజరి చిన్న మస్తాన్, దస్తగిరమ్మకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం ఉన్నారు. వారి చిన్న కుమారుడు పింజరి ఖాజన్న కుటుంబ సభ్యులు,గ్రామస్తులతో ఉన్న ఆస్తి తగాదాలతో 18వ తేదీ ఆత్మహత్యకు ప్రయత్నించగా కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. కోలుకోలేక ఖాజన్న గురువారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు. మృతుడికి భార్య బడేబీ, కూతురు అయేషాబాను ఉన్నారు.

దళితుల శ్మశానాలు అభివృద్ధి చేయండి



విక్టర్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

పాణ్యం: మండలంలో దళితుల శ్మశానాలను అభివృద్ధి చేయాలని కోరుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్, మాలమహానాడు నాయకులు దత్తులు కోరారు. చాలా గ్రామాల్లో శ్మశానాలు సరిగా లేవని, కొన్ని గ్రామాల్లో ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. శ్మశానాలకు వెళ్లాలంటే రోడ్డు సరిగ్గా లేదన్నారు. సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి దళిత వాడలను అభివృద్ధి చేయాలని కోరారు. ఆలమూరులో ఎస్సార్బీసీ కాల్వలకు అక్రమంగా గండ్లు కొట్టడంతో గ్రామంలో 200 ఎకరాలకుపైగా నీట మునిగినట్లు చెప్పారు. దీంతో నాలుగు సంవత్సరాలుగా నేలలు బీళ్లుగా మారినట్లు చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారానికి డ్వాక్రా సాయం

- గృహ లబ్ధిదారులకు అదనంగా ప్రయోజనం
- పొదుపు సంఘాల మహిళలకు రూ.35 వేల రుణం



ప్యాలకుర్తి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

కోడుమూరు: పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి లక్షలాది ఇళ్లను నిర్మిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలకు తీరని ఆశగా మిగిలిపోయిన సొంతింటి కలను ప్రభుత్వం నేరవేరుస్తోంది. ఇళ్ల నిర్మాణాల్లో మధ్య దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ప్రమేయంతో ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వమే లేవుట్లను అభివృద్ధి చేసి ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రి సమకూరుస్తోంది. లేఅవుట్లలో సమస్యలను పరిష్కరిస్తూ ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ సిబ్బంది పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇళ్ల నిర్మాణ పనులను ఇంకా మొదలుపెట్టని పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.35 వేలు మంజూరు చేయించి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టేలా ప్రోత్సహిస్తోంది. నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు అర్బన్, సి.బెళగల్, గూడూరు, కర్నూలు మండలాల పరిధిలో 1,862 ఇళ్లు మంజూరయ్యాయి. సి.బెళగల్ మండలానికి 209, గూడూరు మండలానికి 280, గూడూరు అర్బన్‌లో 532, కోడుమూరు మండలంలో 264, కర్నూలు మండలంలో 572 మంజూరయ్యాయి. కోడుమూరు, సి.బెళగల్, కర్నూల్, గూడూరు మండలాల పరిధిలో దాదాపు 250 మంది మహిళలకు రూ.35 వేల రూపాయలు చొప్పున్న ఇళ్ల నిర్మాణాలకు బ్యాంకు అధికారులు రుణాలు ఇచ్చారు. నియోజకవర్గంలోని మొత్తం 24 లేవుట్లలో ఇంటి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.22 కోట్లు ఖర్చు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేయడంతో పాటూ ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. దీంతో పాటు కరెంట్ సౌకర్యం, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తోంది. ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్న వారికి బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకీ రుణాలను మంజూరు చేస్తోంది. లబ్ధిదారులు, ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టేందుకు ఇసుక, సిమెంట్, కడ్డీలతో పాటు రూ.15 వేలు అడ్వాన్స్‌గా ప్రభుత్వం ఇస్తోంది. బేస్‌మెంట్ పూర్తి చేస్తే మెటీరియల్ బిల్లుతో పాటు ప్రోత్సాహకంగా మరో రూ.15 వేలను ప్రభుత్వం అందిస్తోంది. గతంలో ఇంటి నిర్మాణ పనులను మొదలుపెట్టిన వారికే బిల్లులు మంజూరయ్యేవి. ప్రస్తుత ప్రభుత్వం పేద ప్రజల ఆర్థిక స్థితిని గమనించి ఇంటి నిర్మాణ పనులను అన్ని విధాలా ప్రోత్సహిస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసేందుకు(మంజూరయ్యే బిల్లుల్లో) తక్కువ ధరకు 90 సిమెంట్ సంచులు, అర టన్ను ఐరన్, 20 టన్నుల ఇసుకను ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలాలు	మంజూరైన ఇళ్లు	బిలో బేస్‌మెంట్ లెవెల్	బేస్‌మెంట్ లెవల్	రూఫ్ లెవల్	పూరైనఇండ్లు
గూడూరు	280	7	68	6	156
గూడరు అర్బన్	532	42	99	31	326
కోడుమూరు	264	101	42	20	65
కర్నూలు	577	112	114	30	269
సి.బెళగల్	209	33	48	12	5

అదనపు సాయంతో ఇంటిని పూర్తి చేశాం



జగనన్న కాలనీలో నాకు ఇల్లు మంజూరయ్యింది. ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లులు సరిపోక పోవడంతో ఇంటి నిర్మాణానికి ఇబ్బందయ్యింది. వెలుగు సిబ్బంది బ్యాంకు అధికారులతో మాట్లాడి అదనంగా రూ.35 వేలను పావలా వడ్డీకి మంజూరు చేశారు. దీంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసేందుకు ఎంతో ఉపయోగపడింది. సొంతిల్లు నిర్మించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

– పర్వీన్, సి.బెళగల్

సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నాం

కోడుమూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వివిధ దశల్లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలకు సంబంధించి సకాలంలోలబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేస్తున్నాం. ఇసుకను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇంటి నిర్మాణాలకు బ్యాంకు అధికారులు ఇస్తున్న రూ.35 వేల రుణం లబ్ధిదారులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇండ్లు మంజూరైన మహిళలకు పొదుపు సంఘాల నుంచి వెలుగు సిబ్బంది బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలను మంజూరు చేస్తున్నారు.

–వాసుదేవరావు,హౌసింగ్‌డీఈఈ, కోడుమూరు



కందికాయపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పాణ్యం: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన గురువారం మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మూడున్నరేళ్లలోనే ప్రతి గ్రామానికి కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధికి బాటలు వేసినట్లు తెలిపారు. గ్రామాల నుంచి మండలం, జిల్లాకు అనుసంధానం చేసే రోడ్లకు ప్రాధాన్యత ఇచ్చి నాడు–నేడు పేరుతో రూపురేఖలే మార్చేశామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా చక్కటి రోడ్లు దర్శమిస్తున్నాయని చెప్పారు.

పారదర్శకంగా పథకాలు అమలు

రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలుఅందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు.ఎక్కడా దళారీ వ్యవస్థ లేకుండా గ్రామ/వార్డు సచివాలయాలు,ఆర్బీకేలు, వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలోనే నగదు జమ చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజాధనాన్ని టీడీపీ నాయకులే దోచుకున్నారని విమర్శించారు.

బస్సు ఏర్పాటు చేస్తాం

కందికాయపల్లె గ్రామం నుంచి ఉన్నత విద్యకు కళాశాలలకు బేతంచెర్ల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని గ్రామంలోని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పిల్లల చదువుకు తప్పకుండా సహకారం అందిస్తామన్నారు. పిల్లల అభీష్టం మేరకు బనగానపల్లె డిపో నుంచి బస్సు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

కందికాయపల్లె గ్రామంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సోలార్ పరిశ్రమ సిబ్బందితో మాట్లాడి పరిహారం విషయంలో ఏ రైతుకు అన్యాయం జరగనివ్వమన్నారు. త్వరలోనే రైతులు, కంపెనీ వారితో మరోమారు ముఖాముఖి నిర్వహించి పరిహారం విషయంపై స్పష్టత తెస్తామన్నారు. మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ రామచంద్రుడు, ఎంపీటీసీ రమణయ్య, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

కల్లూరు: స్థానిక 26వ వార్డు 67వ సచివాలయం పరిధిలోని కృష్ణానగర్, న్యూ కృష్ణానగర్‌లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన మేలును ప్రజలకు వివరించారు. గత టీడీపీ, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న సీఎంను ఆశీర్వదించాలని కోరారు. డిప్యూటీ మేయర్ సిద్ధా రేణుక, కార్పొరేటర్లు డీఎల్ కాంతారెడ్డి, శ్వేతారెడ్డి, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, జయరాముడు, మహేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

భానుడి భగభగలు



ఎండ అధికంగా ఉండటంతో చున్నీ కప్పుకుని వెళ్తున్న గడివేముల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

గడివేముల: భానుడి భగభగలు రోజురోజుకు అధికమవుతున్నాయి. ఏప్రిల్ మాసం మూడో వారంలోకి ప్రవేశించడంతో ఉష్ణోగ్రతలు పెరిగాయి. జనం ఎండ వేడి,ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉపశమనం పొందేందుకు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారిస్తున్నారు. ఇళ్లలో ఏసీలు, కూలర్లుకు పని చేబుతున్నారు. బయటకి వచ్చిన సమయంలో పలు జాగ్రత్తలు పాటిస్తున్నారు. టోపీలు, చున్నీలు, కర్చీఫ్‌లను నెత్తిన పెట్టుకుని ఎండల బారి నుంచి కాస్త బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నంద్యాల–నందికొట్కూరు రహదారిలోని గడివేముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష అనంతరం బయటికి వచ్చిన విద్యార్థులు ఎండలు అధికంగా ఉండటంతో తలపై చున్నీ కప్పుకుని ఇంటికి వెళ్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్: మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ భాగ్యరత్న, ఉప సర్పంచ్ మాదులుతో కలిసి ప్రారంభించారు. ఈఓ అజయ్‌భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ సురేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, వార్డు సభ్యులు రామచంద్ర, గోట్ల నాగరాజు తదితరులున్నారు.

ధరలు తగ్గించాలి



ప్యాలకుర్తిలో ప్రజా ప్రదర్శన యాత్ర నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సీపీఐ, సీపీఎం నాయకులు ప్రచారభేరి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. పేదలపై భారం మోపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం ఆపేది లేదని, ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు రాజు, గఫూర్‌మియ్యా, నాయకులు వీరన్న, లక్ష్మన్న, మద్దిలేటి, రాముడు తదితరులున్నారు.

లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ పథకాలు



ఈర్లదిన్నెలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, ప్రజాప్రతినిధులు

సి.బెళగల్: లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసువచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన గురువారం ఈర్లదిన్నె గ్రామంలో సర్పంచ్ పెద్దక్క అధ్యక్షతన అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని సంక్షేమ క్యాలెండర్లతో వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాఠశాలకు వెళ్లే దారి, పరిసరాలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ సందడి చేశారు. గ్రామస్తులు లేవనెత్తిన మంచినీటి సమస్య పరిష్కారం, రోడ్ల నిర్మాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంపీటీసీ నడిపి సోమన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టారెడ్డి, పెద్ద సోమన్న, సర్పంచ్‌లు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఏఓ మల్లేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నేడు ముడుమాలలో...

మండలంలోని ముడుమాల గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోడుమూరు: కోడుమూరులో హంద్రీ నది ఒడ్డున పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం తెలియజేశారు. పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.21,610 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేవలో భాగస్వాములు కావాలి

కల్లూరు: సామాజిక సేవలో అందరూ భాగస్వాములు కావాలని (ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్) ఏఐబీఈఏ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ నాగరాజు, ప్రసిడెంట్ రోజరమణి అన్నారు. గురువారం ఏఐబీఈఏ ఫౌండేషన్ దినోత్సవం సందర్భంగా కర్నూలు శాఖ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ధర్మపేట ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వధూవరులకు డ్రెస్ చేంజ్ గది నిర్మాణం కోసం రూ.38,500 విరాళంగా అందించారు. సభ్యులు శివ కృష్ణ, రాముడు, సతీష్ రెడ్డి, రాజ హరిణి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల వసూలుపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టి పెట్టాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. గురువారం ఆయన కిందిస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం బిల్లుల వసూలే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని డబ్బు రాబట్టాలన్నారు. పాత బకాయిలతో పాటు ప్రభుత్వ శాఖ బకాయిలూ వసూలయ్యేలా చూడాలని సూచించారు.

పేదల భవిష్యత్‌కు వైఎస్సార్‌సీపీ భరోసా

ఓర్వకల్లు: పేదల భవిష్యత్‌కు వైఎస్సార్‌సీపీ భరోసాగా నిలుస్తోందని సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం, కాల్వబుగ్గ, సోమయాజులపల్లె, ఓర్వకల్లు, ఉయ్యాలవాడ తదితర గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. హుసేనాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, పెద్దస్వామి, నాగతిరుపాలు కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూనే, నాలుగేళ్ల జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఇళ్లకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను ప్రజలకు వివరించారు. మరోసారి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే ప్రతిఒక్కరూ సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. ఆయా గ్రామాల సర్పంచులు జయమ్మ, తోట అనూష, సింగిల్ విండో చైర్మన్ చంద్రశఖర్‌రెడ్డి, లోటర్ బాష, శంకర్‌రెడ్డి, విజయభాస్కర్, భాస్కర్‌నాయుడు, మదన్‌వెంకటరెడ్డి, ఆకుల రాముడు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలి

- ఆర్ఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు: గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్. ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పూడిచెర్ల గ్రామంలో 104 సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనతతో బాధపడుతున్న వారికి తగు చికిత్సలు అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరిపడ ఐరన్ పోలిక్ మాత్రలను అందుబాటులో వుండేలా చూడాలన్నారు. గర్భిణులు, 5 ఏళ్ల లోపు పిల్లలకు ఇవ్వాలసిన టీకాలను క్రమం తప్పకుండా వేయాలని పేర్కొన్నారు. వాటి వివరాలను ఎంసీపీ కార్డులో నమోదుచేసి ఎప్పటికప్పుడు, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. తద్వారా పిల్లలను వ్యాధుల భారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. అంతేగాక గర్భిణులు 12 వారాల లోపు నమోదు చేసుకొని సమయానుసారం ఆరోగ్య సేవలు అందించాలని పేర్కొన్నారు. వారు ప్రసవానికి వెళ్లే ఆసుపత్రిని ముందుగానే గుర్తించి, వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వంటింటి ప్రమాదాలపై అప్రమత్తం

కర్నూలు (టౌన్): వంటింట్లో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి ఎం. భూపాల్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక కర్నూలు ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలో అగ్నిమాపక పరికరాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. మదర్ థెరిస్సా ఫార్మాసూటికల్ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు నష్టం నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. గ్యాస్ లీకై వంటింట్లో ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. ఆందోళనకు గురికాకుండా మంటలు ఆర్పడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కో–ఆపరేటివ్ ప్రాజెక్టు ఆఫీసర్ రామాంజనేయులు, జయసింహా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.





సీ క్యాంప్ సర్కిల్‌లో మండుటెండలో తాటిముంజలు విక్రయిస్తున్న రైతులు

తాటి ముంజలకు భలే గిరాకీ

కర్నూలు (న్యూటౌన్): వేసవిలో ఎండలు మండిపోతుండడంతో చల్లటి తాటి ముంజలకు గిరాకీ పెరిగింది. వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు అధిక పోషకాలు ఉండడంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. తాటిచెట్లకు ఉండే కాయల నుంచి వీటిని తీసి అమ్ముతున్నారు. కప్పట్రాళ్ల, కంబాలపాడు, కోయిలకొండ, చిట్యాలలో అత్యధికంగా తాటి చెట్లు ఉన్నాయి. రైతులు చెట్ల నుంచి వీటిని కోసి వ్యయ, ప్రయాసలతో ఆటోల్లో కర్నూలుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తాటి ముంజలు డజన్ రూ.70 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. వేసవిలో తాటిముంజెలను పంచదారతో కలిపి తింటే ఆ రుచి అమోఘమని పెద్దలు చెబుతున్నారు. నగరంలోని సీ క్యాంప్, బిర్లాగేట్, అయ్యప్పస్వామి దేవాలయం – కేసీ కెనాల్ రోడ్డు ఆర్ఎస్ రోడ్డు, ఎస్వీ కాంప్లెక్స్, అశోక్ నగర్, కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్‌లో రైతులు ఉదయం నుంచి అమ్మకాలు ప్రారంభించగా మధ్యాహ్ననికే అమ్ముడుపోతున్నాయి. వీటిని విక్రయిస్తూ పలువురు రైతులు జీవనోపాధి పొందుతున్నారు.